నమస్తే తెలంగాణ
హైదరాబాద్
హైదరాబాద్- మేడ్చల్
I | హైదరాబాద్, సోమవారం 15 జూలై 2024 | HYDERABAD

ట్రేడ్ లైసెన్స్‌లు లేకుండానే.. బిజినెస్

రెన్యువల్ ఫీజులు చెల్లించని 1.60 లక్షల మంది వ్యాపారులు

స్పెషల్ డ్రైవ్‌తో చర్యలకు సిద్ధమైన బల్దియా

ఒక్కో సర్కిల్‌కు 20 ప్రత్యేక బృందాల నియామకం

సిటీబ్యూరో, జూలై 14 (నమస్తే తెలంగాణ) : గ్రేటర్‌లో ట్రేడ్ లైసెన్స్‌లు లేకుండా, ఫీజులు ఎగ్గొడుతున్న వ్యాపారస్తులపై బల్దియా స్పెషల్ డ్రైవ్‌కు సిద్ధమైంది. నగరవ్యాప్తంగా లక్షల్లో వ్యాపారాలు కొనసాగుతుంటే ట్రేడ్ లైసెన్స్‌లు మాత్రం పెరగడం లేదు. ఈ నేపథ్యంలోనే లైసెన్స్‌లు లేకుండా వ్యాపారస్తులు, ఫీజులు చెల్లించని వారిపై స్పెషల్ డ్రైవ్ చేపట్టి ఆదాయం పెంచుకోవాలని నిర్ణయించారు. ఇందులో భాగంగానే ఒక్కో సర్కిల్‌కు 20 ప్రత్యేక బృందాలను నియమించారు. వ్యాపారం చేస్తున్న వారిని గుర్తించి, ట్రేడ్ లైసెన్స్ ఉందా? లేదా? చెక్ చేయనున్నారు. లైసెన్స్ లేకపోతే పెనాల్టీతో పాటు ఫీజులూ వసూలు చేయనున్నారు. ట్రేడ్ లైసెన్స్‌లు రెన్యువల్ చేసుకోని వారిపై చర్యలు తీసుకోనున్నారు. ఇప్పటి వరకు 1.60 లక్షల మంది రెన్యువల్ ఫీజు చెల్లించలేదు. దీంతో స్పెషల్ డ్రైవ్ ద్వారా దాదాపు రూ. 505 కోట్ల మేర వీరి నుంచి ఆదాయం వస్తుందని అధికారులు అంచనాతో ఉన్నారు.

జోన్	ఫీజు చెల్లించిన వ్యాపారస్తులు	వచ్చిన ఆదాయం (రూ.లక్షల్లో)
ఎల్బీనగర్	15023	1169.15
చార్మినార్	12311	544.96
ఖైరతాబాద్	18239	1735.77
శేరిలింగంపల్లి	11303	2627.78
కూకట్‌పల్లి	13499	1015.27
సికింద్రాబాద్	17115	2163.9

వనమహోత్సవం అమలయ్యేనా?

ఇప్పటివరకు ప్రణాళిక సిద్ధం చేయని అధికారులు

మేడ్చల్, జూలై 14(నమస్తే తెలంగాణ): వన మహోత్సవంలో భాగంగా మేడ్చల్ జిల్లాలో 63 లక్షల మొక్కలు నాటేందుకు యాక్షన్ ప్లాన్ సిద్ధం చేయాలని కలెక్టర్ గౌతమ్ అధికారులను ఆదేశించారు. జిల్లాలోని మున్సిపాలిటీ, మండలాల పరిధిలో ప్రదేశాలను గుర్తించి, మొక్కలు నాటే కార్యక్రమానికి శ్రీకారం చుట్టాలని సూచించారు. అయితే ఇప్పటి వరకు అధికారులు వన మహోత్సవ కార్యక్రమంపై ఎలాంటి దృష్టి సారించలేదని తెలుస్తున్నది. మొక్కలు నాటేందుకు సిద్ధంగా ఉన్నా.. అధికారులు ప్రణాళిక సిద్ధం చేయకపోవడంతో కార్యక్రమం అమలవుతుందా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఇదిలా ఉంటే జిల్లాలోని అటవీశాఖ, 13 మున్సిపాలిటీలు, 61 గ్రామ పంచాయతీల్లో ఉన్న నర్సరీల్లో 45 లక్షల మొక్కలు సిద్ధంగా ఉన్నట్లు అధికారులు పేర్కొంటున్నారు. మొక్కలు నాటే లక్ష్యాన్ని చేరుకునే విధంగా మున్సిపాలిటీ అధికారులు, జిల్లా అధికారులు, ఎంపీడీవోలు లక్ష్యాన్ని నిర్దేశించారు. నాటిన మొక్కలకు ట్రీ గార్డ్‌ను ఏర్పాటు చేసి రక్షణ చర్యలు తీసుకోనున్నారు. నాటిన ప్రతి మొక్కను సంరక్షించే విధంగా ప్రజలను భాగస్వాములను చేయనున్నారు.

అశోక్‌నగర్‌లో నిరుద్యోగులను అదుపులోకి తీసుకుంటున్న పోలీసులు

నిర్బంధం..దిగ్బంధం

అడుగడుగునా అడ్డంకులు..ఎక్కడికక్కడే కట్టడి

పోలీసుల వలయాన్ని ఛేదించుకొని.. నిరసన తెలుపుతున్న నిరుద్యోగులు

పోలీసుల ఆధీనంలోకి అశోక్‌నగర్

అయినా ఆగని ఆందోళనలు

సిటీబ్యూరో, జూలై 14 (నమస్తే తెలంగాణ): డీఎస్సీ వాయిదా కోరుతూ నిరుద్యోగులు చేస్తున్న ఆందోళనతో పోలీసులు కంగుతింటున్నారు. ఎప్పుడు, ఎవరు.. ఎక్కడి నుంచి వచ్చి రోడ్లపై బైఠాయిస్తారోననే ఆందోళన పోలీసుల్లో నెలకొంది. ఈ నేపథ్యంలోనే అశోక్‌నగర్ ప్రాంతాన్ని పూర్తిగా పోలీసులు తమ ఆధీనంలోకి తీసుకున్నారు. ప్రతి వీధి, గల్లీలో పహారా కాస్తున్నారు. పోలీసులు చేస్తున్న హడావుడితో స్థానికులు సైతం ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. శనివారం రాత్రి అశోక్‌నగర్, దిల్‌సుఖ్‌నగర్, ఉస్మానియా యూనివర్సిటీ ప్రాంతాల్లో నిరుద్యోగ యువత మెరుపు నిరసనకు దిగిన విషయం తెలిసిందే. ఈ ఆందోళనతో పోలీసులు ఉలిక్కిపాటుకు గురయ్యారు.

రోడ్లపై బైఠాయించి..

ప్రభుత్వం డీఎస్సీని వాయిదా వేయాలని డిమాండ్ చేస్తూ కొన్ని రోజులుగా నగరంలో నిరసనలు, ఆందోళనలు చేస్తున్నారు. ప్రభుత్వం మెట్టు దిగకపోవడమే కాకుండా నిరుద్యోగులకు బాసటగా నిలిచిన వారిపై వివిధ రకాలైన ఆరోపణలు చేస్తున్నది. ఉద్యమ ప్రభావాన్ని తగ్గించేందుకు కుట్రలు చేస్తున్నది. ఈ కుట్రలను గుర్తించిన వేలాది మంది నిరుద్యోగ యువత శనివారం అర్ధరాత్రి రోడ్లపైకి ఒక్కసారిగా చొచ్చుకొని వచ్చి.. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ ఆందోళన చేశారు. రోడ్లపై బైఠాయించిన నిరుద్యోగులు ఆదివారం ఉదయం వరకు ధర్నాలు నిర్వహించారు.

సర్కారు దిగిరాకపోవడంతో..

అశోక్‌నగర్, ఉస్మానియా, దిల్‌సుఖ్‌నగర్ ప్రాంతాల్లో పోలీసులు నిర్బంధాన్ని కొనసాగిస్తున్నారు. ప్రభుత్వ, ప్రైవేటు హాస్టళ్లు, లైబ్రరీలు ఉన్న ప్రాంతాలను చుట్టుముట్టారు. యువకులు ఎవరూ రోడ్లపైకి రాకుండా ఉండేలా ఆదివారం సైతం కట్టడి చేశారు. చిక్కడపల్లిలోని సెంట్రల్ లైబ్రరీ వద్ద పోలీసులు నిఘాను కట్టుదిట్టం చేశారు. మరోవైపు పరీక్షకు తేదీలు దగ్గరపడుతుండగా, వాయిదా వేయాలని డిమాండ్ చేస్తున్నా.. ప్రభుత్వం దిగిరాకపోవడంతో నిరుద్యోగుల్లో ఆందోళన మరింతగా పెరుగుతున్నది. తాము న్యాయపోరాటం చేస్తున్నామని, ఇంటెలిజెన్స్ రిపోర్టు, న్యాయ నిపుణులు, పరీక్షలు నిర్వహించే నిపుణుల అభిప్రాయాలను తీసుకొని నిరుద్యోగులు చేస్తున్న ఆందోళన గురించి.. ప్రభుత్వం తెలుసుకోవాలని పలువురు సూచిస్తున్నారు. తెలంగాణ ఉద్యమ సమయంలో విద్యార్థులను అదుపు చేయడం కోసం పోలీసులు ఉస్మానియా వర్సిటీ, దిల్‌సుఖ్‌నగర్, అశోక్‌నగర్ ప్రాంతాల్లో చేసిన అరాచకాలే తిరిగి తెలంగాణ పోలీసులు మొదలు పెట్టారంటూ నిరుద్యోగులు ఆరోపిస్తున్నారు. యువతను ఆందోళన చేయకుండా కట్టడి చేసేందుకు పోలీసులు రహదారులపై బందోబస్తును నిర్వహిస్తున్నారు. అయినా... పోలీసుల వలయాన్ని ఛేదించుకొని ఆదివారం కూడా నిరుద్యోగులు తమ నిరసన గళాన్ని వినిపించారు.

కిరాయిలు కట్టలేకపోతున్నాం..

గత సీఎం కేసీఆర్ మాకు డబుల్ బెడ్రూం ఇండ్లు కేటాయించారు. అయితే 8 నెలలు అవుతున్నా.. ప్రస్తుత ప్రభుత్వం కనీస సదుపాయాలు కల్పించలేదు. అధికారుల చుట్టూ తిరుగుతున్నా.. వారు పట్టించుకోవడం లేదు. ఇండ్లు వచ్చినా సదుపాయాలు లేవు. దీంతో అద్దె ఇండ్లలో ఉంటూ..కిరాయిలు కట్టలేకపోతున్నాం.

– పూలమ్మ, బాగ్‌లింగంపల్లి

వచ్చే ఆదాయం కాస్తా..

డబుల్ ఇండ్లలో కరెంట్, మంచినీటి సదుపాయాలు లేకపోవడంతో ఉండే పరిస్థితి లేదు. అద్దెలు కట్టడం భారంగా మారాయి. పిల్లల ఫీజులు కట్టే లేకపోతున్నాం. మాకు వచ్చే ఆదాయం కాస్తా ఇంటి కిరాయికే పోతున్నది.

– దేవి, లబ్ధిదారు

ఈ డబుల్‌లో ఎట్లుండాలి..?

సర్కారుపై డబుల్ బెడ్రూం ఇండ్ల లబ్ధిదారుల ఆగ్రహం

కనీస సదుపాయాలు లేవంటూ..మండిపాటు

ఇందిరాపార్కు వద్ద ధర్నా

సిటీబ్యూరో/చిక్కడపల్లి, జూలై 14 (నమస్తే తెలంగాణ) : సొంతింటి కల సాకారమైందన్న ఆనందాన్ని కాంగ్రెస్ సర్కారు దూరం చేస్తోంది. డబుల్ బెడ్రూం ఇండ్లకు మౌలిక వసతులు కల్పించాల్సిన ప్రభుత్వం.. ఎనిమిది నెలలుగా ఏ ఒక్క పనిని పూర్తి చేయలేదు. తాగునీరు, కరెంట్, రహదారి, లిఫ్ట్ లేక లబ్ధిదారులు ఇబ్బందులుపడుతున్నారు. వెంటనే డబుల్ బెడ్రూం ఇండ్ల వద్ద కనీస మౌలిక సదుపాయాలు కల్పించాలంటూ ఆదివారం ఇందిరాపార్కు వద్ద లబ్ధిదారులు ధర్నా చేపట్టారు. ప్రభుత్వ తీరును తీవ్రంగా ఎండగట్టారు. గ్రేటర్ నలుమూలల నుంచి లబ్ధిదారులు భారీగా తరలివచ్చి నిరసనలో పాల్గొన్నారు. కేసీఆర్ ప్రభుత్వం దాదాపు 65వేలకు పైగా లబ్ధిదారులకు ఇండ్లను పంపిణీ చేసిందని, కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి ఆరు నెలలు దాటినా.. ఆ ఇండ్ల సముదాయాల్లో మంచినీరు, కరెంటు, రోడ్డు సదుపాయాలు కల్పించలేదని లబ్ధిదారులు మండిపడ్డారు. డబుల్ బెడ్రూం ఇండ్లలో లిఫ్టులు పనిచేయడం లేదని, ఈ ఏడాది విద్యా సంవత్సరం ప్రారంభమైనందున పిల్లల చదువులకు ఆటంకం ఏర్పడుతున్నదని, ప్రభుత్వం వెంటనే చొరవ తీసుకొని మౌలిక సదుపాయాలు కల్పించి డబుల్ బెడ్రూం ఇండ్లలో ఉండేలా చర్యలు తీసుకోవాలని లబ్ధిదారులు డిమాండ్ చేశారు.

ఇండ్లలో సదుపాయాలు కల్పించాలి : ప్రొఫెసర్ నాగేశ్వర్

గ్రేటర్ హైదరాబాద్ శివారు ప్రాంతాల్లో గత ప్రభుత్వం నిర్మించిన 65వేల డబుల్ బెడ్రూం ఇండ్లలో సదుపాయాలు కల్పించాలని ప్రొఫెసర్ నాగేశ్వర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సీపీఎం గ్రేటర్ హైదరాబాద్ సెంట్రల్ సిటీ కమిటీ ఆధ్వర్యంలో ధర్నా చౌక్ లో డబుల్ బెడ్రూం ఇండ్లలో కరెంట్, మంచినీరు, రోడ్డు, లిఫ్ట్ సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేస్తూ ధర్నాను నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ప్రొఫెసర్ నాగేశ్వర్ మాట్లాడుతూ డబుల్ బెడ్రూం ఇండ్ల ప్రాంతాల్లో మంచినీటి సదుపాయం కరెంట్, రోడ్డు, లిఫ్ట్ ఏర్పాటు చేయకపోవడంతో డబుల్ ఇండ్లలో పేదలు నివసించే పరిస్థితి లేదన్నారు. మౌలిక వసతులు కల్పించేందుకు రూ. 700 కోట్లు అవసరమని, వచ్చే బడ్జెట్‌లో డబుల్ బెడ్రూం ఇండ్లకు అత్యంత ప్రాధాన్యతనిచ్చి నిధులు కేటాయించాలన్నారు. సీపీఎం నగర కార్యదర్శి శ్రీనివాస్ , సీపీఎం నగర కార్యదర్శివర్గ సభ్యులు శ్రీనివాసరావు, ఎం.దశరథ్, మహేందర్, డబుల్‌బెడ్రూం ఇండ్ల సంక్షేమ సంఘం అధ్యక్షుడు వి.విజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వైద్య దేవుళ్లు..

60 శాతం కాలిన వ్యక్తికి..

పునర్జన్మనిచ్చిన ఉస్మానియా వైద్యులు

పైసా ఖర్చులేకుండా చికిత్స..

15 రోజుల్లోనే రికవరీ

ఇంత తక్కువ సమయంలో కోలుకోవడం ప్రపంచ రికార్డే

సిటీబ్యూరో, జూలై 14 (నమస్తే తెలంగాణ): సాధారణంగా 60 శాతం కాలిన గాయాలకు గురైన వ్యక్తులు ప్రాణాలతో బయటపడటం చాలా అరుదు. అందులో వారు కోలుకోవడానికి కనీసం 2 నెలల నుంచి 3 నెలల సమయం పడుతుంది. కానీ 60 శాతం కాలిన గాయాలకు గురైన వ్యక్తికి కొలాజిన్ షీట్స్ (వన్ టైమ్ డ్రెస్సింగ్)తో నిరంతర పర్యవేక్షణలో చికిత్స అందించి, కేవలం 15 రోజుల్లోనే రోగిని డిశ్చార్జి చేసి.. రికార్డు సృష్టించారు ఉస్మానియా ప్లాస్టిక్ సర్జరీ విభాగం వైద్యులు. బిహార్‌కు చెందిన సహనబాజ్(19) వృత్తిరీత్యా గృహనిర్మాణ కార్మికుడు. ఉపాధి కోసం నగరానికి వచ్చిన అతడు.. 15 రోజుల కిందట బండ్లగూడలో ఇంటి నిర్మాణ పనులు చేస్తుండగా, ప్రమాదవశాత్తు హైటెన్షన్ విద్యుత్ తీగ తగిలి తీవ్రంగా గాయపడ్డాడు. దీంతో బాధితుడిని చికిత్స కోసం ఉస్మానియా దవాఖానలోని ప్లాస్టిక్ సర్జరీ విభాగంలో చేర్పించారు. వైద్యులు రోగిని పరిశీలించి.. 60 శాతం కాలిన గాయాలకు గురైనట్లు నిర్ధారించారు. సాధారణంగా విద్యుత్‌ఘాతానికి గురైన రోగులు, అందులోనూ 60 శాతం కాలిన గాయాలకు గురైన వారు ప్రాణాలతో బయటపడటం అరుదు. అంతే కాకుండా వారు రికవరీ కావడానికి కనీసం 3 నెలలకు పైగానే సమయం పడుతుంది. అయితే రోగి ప్రాణాలు కాపాడాలనే లక్ష్యంతో ఈ కేసును ప్రతిష్టాత్మకంగా తీసుకున్న ప్లాస్టిక్ సర్జరీ విభాగం ప్రొఫెసర్ డాక్టర్ పలుకూరి లక్ష్మి..రోగి దవాఖానలో చేరిన 12 గంటల్లోపే అత్యవసరంగా శస్త్ర చికిత్స చేశారు. ముఖం, అప్పర్ లింబ్, లోయర్ లింబ్ తదితర శరీరంలోని కీలక భాగాలు తీవ్రంగా కాలిన గాయాలకు గురికావడంతో మెడకు 'సెంట్రల్ లైన్' పెట్టి ఫ్లూయిడ్స్ అందించి, వెంటనే సర్జరీ జరిపినట్లు డాక్టర్ పలుకూరి లక్ష్మి వివరించారు. 60 శాతం కాలిన గాయాలకు గురైన రోగులకు సర్జరీ చేయాలంటే సాధారణంగా నాలుగైదు రోజులు ఆగాల్సి ఉంటుందని, ఆలోపు ఇన్‌ఫెక్షన్స్ వస్తే సర్జరీ చేయడం కుదరదని.. దీంతో రోగి కోలుకోకపోవడమే కాకుండా ప్రాణాలకూ ముప్పు ఉంటుందన్నారు. అయితే ఈ కేసులో రోగిని నిరంతరం పర్యవేక్షిస్తూ సెంట్రల్ లైన్ నుంచి ఫ్లూయిడ్స్ అందిస్తూ శరీర ఉష్ణోగ్రతలు, ఆక్సిజన్ స్థాయిలు తగ్గిపోకుండా ప్రత్యేక జాగ్రత్తలు తీసుకున్నట్లు వివరించారు. అనస్థీషియా వైద్యులు డా.మాధవి, ప్లాస్టిక్ సర్జరీ విభాగానికి చెందిన వైద్యబృందంతో రోగికి మెరుగైన చికిత్స అందించి.. 15 రోజుల్లోనే డిశ్చార్జ్ చేసినట్లు తెలిపారు.

15 రోజుల్లో రికవరీ..

ఉస్మానియా సూపరింటెండెంట్ డాక్టర్ నాగేందర్ చొరవతో రోగికి 12 గంటల్లోనే శస్త్రచికిత్స చేయడమే కాకుండా ఖరీదైన 10 కొలజన్ షీట్స్‌తో బయోలాజికల్ డ్రెస్సింగ్ చేశాం. సాధారణంగా కాలిన గాయాలకు గురైన రోగులకు కార్పొరేట్‌లో అయితే ఒక శాతానికి లక్ష రూపాయల చొప్పున ఖర్చవుతుంది. సహనబాజ్‌కు జరిపిన చికిత్సకు ప్రైవేటులో కనీసం రూ. 20 లక్షలకు పైనే ఖర్చవుతుంది. అంత ఖరీదైన వైద్యాన్ని పైసా ఖర్చులేకుండా విజయవంతంగా నిర్వహించాం. పేద రోగుల వైద్యానికి దవాఖాన సూపరింటెండెంట్ డా.నాగేందర్ ప్రత్యేక కొరవ తీసుకోవడం వల్లే ఇలాంటి క్లిష్టమైన కేసులను విజయవంతంగా ట్రీట్ చేయగలుగుతున్నాం. ప్రపంచ ప్లాస్టిక్ సర్జరీ వారోత్సవాల్లో భాగంగా ఈ క్లిష్టమైన కేసును విజయవంతంగా ట్రీట్ చేసి..15 రోజుల్లోనే రోగిని పూర్తిగా కోలుకునేలా చేసి.. నడిపించగలిగాం. ఇంత తక్కువ సమయంలో రోగి కోలుకోవడం ప్రపంచ రికార్డుగా చెప్పవచ్చు.

– ప్లాస్టిక్ సర్జరీ విభాగం ప్రొఫెసర్ డాక్టర్ పలుకూరి లక్ష్మి

ఎల్‌సీ.. వెయిట్ అండ్ సీ..

లైన్ క్లియరెన్స్ కోసం విద్యుత్ కాంట్రాక్టర్ల ఎదురుచూపులు

సిటీబ్యూరో, జూలై 14 (నమస్తే తెలంగాణ): గ్రేటర్ హైదరాబాద్‌తో పాటు నగర శివారు ప్రాంతాల్లో విద్యుత్ అవసరాల కోసం ప్రైవేటు వ్యక్తులు, సంస్థలు కొత్తగా లైన్లను, ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేసుకుంటారు. అలాంటి వారికి కాంట్రాక్టర్లు పనులు పూర్తి చేసిన వెంటనే విద్యుత్ సరఫరాను అందించేందుకు ఎల్‌సీ (లైన్ క్లియరెన్స్) తీసుకోవాల్సి ఉంటుంది. దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ (టీఎస్ఎస్‌పీడీసీఎల్) పరిధిలో 5-6 నెలల్లో సుమారు రూ. 60 కోట్లకు పైగానే చేపట్టిన పనులు పెండింగ్‌లోనే ఉన్నాయి. వాటికి ఎల్‌సీ ఇవ్వాల్సిన బాధ్యత విద్యుత్ శాఖపై ఉంది. కాంట్రాక్టర్లు పనులు పూర్తి చేసి 4-5 నెలలుగా ఎదురు చూస్తున్న వాటికి వెంటనే ఎల్‌సీలు ఇవ్వడం లేదు. ఈ అంశంపై కాంట్రాక్టర్లు ఆందోళన చేస్తున్నా.. పట్టించుకోవడం లేదు. మొక్కుబడిగా అప్పుడప్పుడు ఎల్‌సీలు ఇస్తున్నారే తప్ప, నిరంతర ప్రక్రియగా ఉండాల్సిన ఎల్‌సీలను కొన్ని రోజులు బ్యాన్ చేశారని విద్యుత్ కాంట్రాక్టర్లు వాపోతున్న పరిస్థితి నెలకొంది. రోజులు, నెలలు గడుస్తున్నా డిస్కం పరిధిలో వందలాది మంది కాంట్రాక్టర్లు ఎల్‌సీ కోసం ఎదురుచూసి.. ఇటీవల ఖైరతాబాద్‌లోని కార్పొరేట్ కార్యాలయానికి వచ్చి ధర్నా చేస్తామని హెచ్చరించారు. ఇదే విషయమై అనేక సార్లు డిస్కం సీఎండీని సైతం కలిసి విజ్ఞప్తి చేసినా ఫలితం ఉండటం లేదని కాంట్రాక్టర్లు వాపోతున్నారు. 'కోట్లాది రూపాయలు వెచ్చించి కాంట్రాక్టర్లు పనులు చేసినా.. సకాలంలో ఎల్‌సీలు ఇవ్వకపోవడంతో పనులు అప్పగించిన వినియోగదారులు మాపై తీవ్ర ఒత్తిడి పెంచుతున్నారు. ఈ విషయంలో డిస్కం అధికారులు సర్కిళ్ల వారీగా ఎల్‌సీలు ఎక్కడెక్కడ ఇవ్వాల్సి ఉందో గుర్తించాలి' అని తెలంగాణ ఎలక్ట్రికల్ కాంట్రాక్టర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు జీసీరెడ్డి అన్నారు.

రాంనగర్‌లో..

రాంనగర్‌లో జలమయమైన రహదారి

అమీర్‌పేటలో..

యూసుఫ్‌గూడ శ్రీకృష్ణానగర్‌లో వరద నీటిలో కొట్టుకుపోతున్న కారు

దంచికొట్టిన వాన

అత్యధికంగా 7.75 సెం.మీల వర్షపాతం నమోదు

సిటీబ్యూరో, జూలై 14 (నమస్తే తెలంగాణ)/ముషీరాబాద్: బంగాళాఖాతంలో ఏర్పడిన ఆవర్తనానికి తోడు నైరుతి రుతుపవనాలు చురుకుగా కదులుతుండటంతో ఆదివారం గ్రేటర్‌లోని పలు చోట్ల వర్షం దంచి కొట్టింది. మారేడ్‌పల్లిలోని న్యూ మెట్టుగూడలో రాత్రి 9గంటల వరకు అత్యధికంగా 7.75 సెం.మీల వర్షపాతం నమోదైనట్లు టీజీడీపీఎస్ అధికారులు వెల్లడించారు. వర్షం నీరు కారణంగా లోతట్టు ప్రాంతాల్లో రహదారులు జలమయమయ్యాయి. ముషీరాబాద్ రాంనగర్ ఆదర్శ అపార్టుమెంట్ సమీపంలో వరద నీటిలో కారుతో సహా నలుగురు చిక్కుకుపోయారు. స్థానికులు కారు అద్దాలు పగలగొట్టి వారిని కాపాడారు. కాగా, న్యూ మెట్టుగూడ 7.75 సెం.మీ, యూసుఫ్‌గూడ 7.65, ముషీరాబాద్ 7.3, జూబ్లీహిల్స్ ఎంసీఆర్‌హెచ్‌ఆర్‌డీ 7.2, హెచ్‌సీయూ, శేరిలింగంపల్లి, మాదాపూర్ 6.95, నాచారం 6.88, సీతాఫల్‌మండి 6.85, ముషీరాబాద్ తాళ్లబస్తీ 6.3, బన్సీలాల్‌పేట, మోండా మార్కెట్ 6.28, పాటిగడ్డ, బుద్ధానగర్ 6.15, ఉప్పల్ చిలుకానగర్ 6.0, అల్లాపూర్, ఉస్మానియా యూనివర్సిటీ 5.90, రహ్మత్‌నగర్, భోలక్‌పూర్ 5.73, మౌలాలి, ఓల్డ్ సుల్తాన్‌నగర్ 5.55, గచ్చిబౌలి, ఉప్పల్ 5.40, ఖైరతాబాద్, బేగంపేట, షేక్‌పేట 5.20 సెం.మీల వర్షపాతం నమోదైంది. ఈవీడీఎం కమిషనర్ రంగనాథ్ పలు ప్రాంతాలను అధికారులతో కలిసి సందర్శించారు. వాటర్ లాగింగ్ పాయింట్లు, క్యాచ్‌పిట్స్, మ్యాన్ హోళ్లను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఆవర్తనం ప్రభావంతో రాగల మరో మూడు రోజులు భారీ నుంచి అతిభారీ వానలు కురిసే అవకాశమున్నట్లు అధికారులు తెలిపారు. వర్షాలతో ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా చర్యలు తీసుకోవాలని బల్దియా కమిషనర్ ఆమ్రపాలి, మేయర్ గద్వాల్ విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ శ్రీలతా శోభన్‌రెడ్డి టెలీకాన్ఫరెన్స్ ద్వారా అధికారులను ఆదేశించారు.